www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 6 డిసెంబర్ 2023 5 తూర్పుగోదావరి



నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మిచౌంగ్ తుపాను నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున బుధవారం జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు స్థానిక సెలవు దినంగా ప్రకటించామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహాం తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పిల్లలకు భద్రత ఇవ్వాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ నేపథ్యంలో వాతావరణం దృష్ట్యా పాఠశాలలను మూసివేయాలని కోరారు. జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖాధికారులు ఈ విషయాన్ని గుర్తించి అన్ని విద్యాసంస్థలు ఈ ఆదేశాలను అమలు చేసేలా చూడాలని తెలిపారు.

ముంచిన మిచౌంగ్

- జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- ఈదురుగాలులతో విధ్వంసం
- నీటిలో నానుతున్న ధాన్యం రాశులు

మిచౌంగ్ తుపాను రైతులను నిండా ముంచింది. భారీ వర్షం పంటలను ముంచెత్తింది. మరో పక్క ఈదురుగాలులు విధ్వంసం సృష్టించాయి. సోమవారం నుంచి కురుస్తున్న వర్షానికి జిల్లా తడిసి ముద్దయ్యింది. జనజీవనం స్తంభించింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో విద్యాసంస్థలన్నింటికీ సెలవు ప్రకటించారు. తీరాన్ని దాటుతుందనే వార్తలతో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు.

:: ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, యంత్రాంగం ::



గోకవరంలో నీటిలో నానుతున్న వరిపనలు

అన్నదాతలకు తీరని నష్టం

పంట చేతికందే సమయంలో తుపానుతో అన్నదాతలు తీరని నష్టం వాటిల్లింది. పనలపై ఉన్న పంట వర్షపు నీటిలో నానుతోంది. పలుచోట్ల ధాన్యపు రాసులు తడిసి ముద్దయ్యాయి. తుపాను నేపథ్యంలో అధికార యంత్రాంగం రెండు రోజులు పాటు హడావుడి చేసినా పూర్తిస్థాయిలో పంటను కాపాడటంతో విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో 1.75లక్షల ఎకరాల్లో వరి సాగు జరితే 60 శాతం మాత్రమే కోతలు పూర్తయ్యాయి. మిగిలిన 40 శాతం పంటలో చాలా వరకూ నేలకొరిగింది. సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా ప్రభుత్వం 90వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసింది. మరో 60వేల మెట్రిక్ టన్నులను వ్యాపారులు కొనుగోలు చేశారు. మిగిలిన 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతులు వద్దనే ఉంది. ఈ ధాన్యంలో 19వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కళ్లాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కలెక్టరు ఆధ్వర్యంలో ప్రత్యేక టీములు ఏర్పాటు చేసి ఆది, సోమవారాల్లో విస్తృతంగా పర్యటించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. సుమారు 10 వేల మెట్రిక్ టన్నులు తరలించామని చెబుతున్నారు. మిగిలిన 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే తడిసినట్టు వార్తలు వస్తున్నాయి. అధికారిక లెక్కలు ఇలా ఉన్నా 50 వేట మెట్రిక్ టన్నులకుపైగానే ధాన్యం తడిసినట్టు రైతులు చెబుతున్నారు. గోకవరం, కొవ్వూరు, పెరవలి పంటలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి.

నిబంధనలు ముందే సడలించి ఉంటే...

తుపాను ముందు వరకూ తేమ ఇతర నిబంధనలతో ఆర్‌బికెల్లో కొనుగోళ్లు సరిగా నిర్వహించలేదు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో సోమవారం సిఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నిబంధనలను సడలించి తేమ ఉన్నా, లేకున్నా ధాన్యన్ని మద్దతు ధరలకు కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అప్పటికే వర్షం మొదలైంది. సోమవారం, మంగళవారం ధాన్యాన్ని తరలించేందుకు అధికారులు హడావుడి చేశారు. కాని పూర్తిస్థాయిలో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడలేకపోయారు. ముందుగానే నింబధనలను సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని, దళారుల వద్ద మోసపోయేవాళ్లం కాదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వెంటనే తడిసిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

ఈదురుగాలుల బీభత్సం

తుపాను నేపథ్యంలో మంగళశారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు, సుడిగాలులు బీభత్సాన్ని సృష్టించాయి. రాజమహేంద్రవరం నగరంలో జెఎన్ రోడ్డులో వ్యాపార సముదాయాల ఎదుట ఏర్పాటుచేసిన రేకుల షెడ్డు గాలికి ఎగిరి పడటంతో స్థానికులు భయాందోళనకు గుర య్యారు. రామాలయం సెంటర్, మోరంపూడిల్లో భారీ హోర్డింగ్‌లు గాలికి ఎగిరిపడ్డాయి. మోరంపూడిలో కార్మికులు ఉంటున్న ఒక తాత్కాలిక షెడ్డు కూలిపోయింది. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మోరంపూడి ప్రాంతంలో సుడిగాలులకు ఒక అపార్ట్‌మెంట బీటలు వారింది. మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ కారణంగా ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు రహదారులు పూర్తిగా జలమయం అయ్యాయి. పాఠశాలలకు సెలవు ఇవ్వటంతో విద్యార్థులు ఇంటికే పరిమితం అయ్యారు.

జిల్లా వ్యాప్తంగా సగటు వర్షపాతం 34.5 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా నల్లజర్ల మండలంలో 111.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా బిక్కవోలులో 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజమహేంద్రవరం డివిజన్‌లో గోకవరంలో అత్యధికంగా 49.2 మిల్లీమీటర్లు ఎంఎం, రాజమహేంద్రవరం రూరల్‌లో 21.2 ఎంఎం చొప్పున వర్షపాతం నమోదైంది. కొవ్వూరు డివిజన్‌లో నల్లజర్లలో 111.6 మిల్లీమీటర్లు, దేవరపల్లిలో 50 మిల్లీమీటర్ల చొప్పున అత్యధిక వర్షపాతం నమోదైంది.

మండలాల్లో ఇదీ పరిస్థితి...

గోకవరం మండలంలో 15 వేలఎకరాల్లో వరి పంట, 5 వేల ఎకరాల్లో దుంప తోటలు, మరి కొద్ది ఎకరాల్లో అరటి తోటలు సాగు చేవారు. వర్షాలకు కళ్లాలపై వరి పంట పూర్తిగా తడిసి ముద్దయ్యింది. దుంప తోటలు పక్వానికి రావడంతో వర్షాల వల్ల భూమి లోపల ఉన్న దుంప తోటలు ఊటెక్కిపోయాయి. ఫలితంగా దుంప కుళ్లిపోయే ప్రమాదం తలెత్తింది. గాలివానకు అరటి తోటలో నేలకొరిగాయి. తమను ఆదుకోవాలనిరైతులు కోరుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

చాగల్లు మండలంలో 38 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఎర్పడింది. చాగల్లు పంచాయితీలోని 8 మోటార్లు ఆగిపోవడంతో నీటి సరఫరాకు ఇబ్బంది పడ్డారు. విద్యుత్, వాటర్ వర్కర్స్ సిబ్బంది మెరుగుపరచటానికి కషి చేస్తున్నారు. చలి పెరగడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తుపాను వల్ల సహకారం పొందేవారు సమచారం ఇవ్వాలని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు.

ఉండ్రాజవరంలో తుపాను ప్రభావం పంటలపై స్వల్పంగా ప్రభావం చూపే అవకాశం ఉందని మండల ప్రత్యేక అధికారి ఎం.సందీప్ తెలిపారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఎం విశ్వాస రావు, ఉండ్రాజవరం విఆర్ఒ పాపారావు లతో కలిసి ఆయన మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. 600 ఎకరాల వరి పంటపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో భారీ వర్షం కురిసింది. తుఫాను తీరానికి చేరిన సమయంలో సమయంలో రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు భారీ వర్షం కురిసింది. 94 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని గణాంకాధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలు పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎటువంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తహశీల్దార్ రాధిక తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి రుచిత మాట్లాడుతూ రైతులు కోసిన వరిని ఆర్‌బికెల ద్వారా మిల్లులకు చేర్చుతున్నామన్నారు. కుప్పలుగా ఉన్న వరి తడవకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు.

పెరవలి మండలంలో ఈదురు గాలులు, భారీ వర్షాలకు వరి, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. మంగళవారం సుడిగాలికి ఉమ్మడివారిపాలెం, ముక్కామల, కాకరపర్రు, తీపర్రులో కొబ్బరి, మామిడి చెట్లు, మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదు అన్నవరప్పాడు నల్లాకులవారిపాలెం కానూరు పెరవలి తదితర ప్రాంతాలలో ఉన్న ఇటుకల బట్టీలోకి నీరు చేరడంతో పచ్చి ఇటుకలకు నష్టం వాటిల్లింది. ముక్కామలలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత సరఫరా నిలిపేసింది. దీంతో విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి పునరుద్ధరించారు. విరిగిన కొబ్బరి చెట్లను కరెంట్ స్తంభాలను దెబ్బతిన్న పశువులపాకలను నీట ముడిగిన వరి చేనులను సర్పంచ్ కేతాత్రిమూర్తులు పరిశీలించారు.

గోపాలపురంలో 80 హెక్టార్లలో పంట పొలాలు నీటిలో మునిగాయని ఎఒ రాజారావు తెలిపారు. అత్యధికంగా వెంకటాయపాలెం, భీమోలు గ్రామాల్లో 60 హెక్టార్లు వరి పంట నీట మునిగినట్లు తెలిపారు. 8 ఎకరాల్లో వేరుశనగ పంట తడిసిందన్నారు. 34.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి - కడియం

తుపాను నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ కె.మాధవీలత పేర్కొన్నారు. మురమండలో ఆర్‌డిఒతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులతో మాట్లాడారు. వాతావరణ శాఖ హెచ్చరిక అందిన వెంటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. వివిధ శాఖలు చేపట్టాల్సిన పనులను స్పష్టంగా తెలియజేసి, క్షేత్ర స్థాయికి పంపించామన్నారు. కలెక్టరేట్, ఆర్‌డిఒ, డివిజన్,మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ం సమస్యలు తెలుసుకుంటూ అప్రమత్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కళ్లాల్లో ధాన్యాన్ని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని వ్యవసాయ, పౌర సరఫరాల సంస్థకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని మిల్లుల్లకి చేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంకా ఎక్కడైనా కోతలు పూర్తి చేసిన ధాన్యం నిలవ ఉంటే వ్యవసాయ సహాయకుని ద్వారా లేదా కంట్రోల్ రూంకి సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ అన్ని మండలాల్లో కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలించే క్రమంలో రహదారుల క్లియరెన్స్ బందాలు, విద్యుత్ పునరుద్ధరణ బందాలు జెసిబిలు, ట్రాక్టర్లు, విద్యుత్ రంపాలు తదితర సామగ్రితో సిద్ధంగా ఉన్నాయన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుకి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, యథాస్థితిలో మిల్లులకు పంపనున్నట్లు తెలిపారు. రానున్న రెండు మూడు రోజులువరి కోతలు చేయరాదని రైతులకి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఎ.చైత్ర వర్షిణి, తహశీల్దార్ ఎం.సుజాత, ఇతర సిబ్బంది ఉన్నారు.

కొవ్వూరు రూరల్:కొవ్వూరు మండలం కాపవరం గ్రామంలో హార్టికల్చర్, ప్యాడి పంటలను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ మార్పులు నేపథ్యంలో కోతలు కోసిన పంటలను మిల్లులకు తరలించామన్నారు. మండలంలో 10200ఎకరాల్లో వరి సాగు చేయగా పది వేల ఎకరాల్లో కోతలు కోశారన్నారు. 200 ఎకరాల్లో కోయాల్సి ఉందన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కృష్ణనాయక్, డిఎఒ ఎస్.మాధవరావు, డిహెచ్ఒ అరుణ కుమారి, తహశీల్దార్ బి. నాగరాజునాయక్, ఇతర వ్యవసాయ అనుబంధ అధికారులు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.


అనపర్తి మండలంలోని దుప్పలపూడి, పాలమూరు గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ పర్యటించారు. తడిచిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. త్వరిత గతిన మిల్లుకు తరలించాని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. అరటి పంటలకు మంగళవారం కురిసిన వర్షాలకు ఇబ్బందులు లేవని మరో 24 గంటలు ఇదే విధగా కురిస్తే అరటి పంట నష్టం వచ్చే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ జిల్లా అధికారి సుజాత కుమారి తెలిపారు.



గోకవరంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతు పాట్లు



పెరవలి మండలం ముక్కామలలో రోడ్డుకు అడ్డంగా కూలిన వృక్షాలు



పెరవలి మండలం ముక్కామలలో సుడిగాలులకు కూలిన విద్యుత్ స్తంభం

ధాన్యం రాశులను పరిశీలించిన 'కుందుల'

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కూనురు -పెండ్యాల రోడ్డులో రైతులు వేసిన ధాన్యం రాశులను మంగళవారం టిడిపి నిడదవోలు నియోజకవర్గం సీనియర్ నాయకులు కుందుల వీరవెంకటసత్యనారాయణ స్వయంగా పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ధాన్యపు రాసులు తడుస్తున్నాయి అన్నారు. కనీసం ప్రభుత్వం బరకాలను సైతం ఇవ్వట్లేదన్నారు. తడిసిన ధాన్యాన్ని నిబంధనలను సడలించి వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆయన వెంట అనపర్తి జయ తదితరులున్నారు.

ఎసైన్డ్ భూములపై హక్కులు చారిత్రాత్మక నిర్ణయం

హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - కొవ్వూరు రూరల్

ఎసైన్డ్ భూములపై హక్కులు కల్పించడం ముఖ్యమంత్రి జగన్ చారిత్రాత్మక నిర్ణయమని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో మంగలశ్వారం పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. చిడిపి గ్రామానికి చెందిన 97 కుటుంబాలకు, ఐ.పంగిడి గ్రామానికి చెందిన 32 కుటుంబాలకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. మొత్తం 129 మందికి లంక భూములు, ఇళ్ల పట్టాల పంపిణీ మహోత్సవాన్ని చేపట్టామన్నారు. లంక భూముల్లో ఎవరైతే వ్యవసాయం చేసుకుంటున్నారో వారికి సంపూర్ణ హక్కు కల్పించాలని జగనన్న తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం అని తెలిపారు. లంక భూమిని ఒక్కొక్కరికి 65 సెంట్లు చొప్పున 97 మందికి సంపూర్ణ హక్కులు కల్పిస్తూ హక్కు పత్రం అందించామన్నారు. ఇప్పుడు సొంతంగా వ్యవసాయం చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. కొవ్వూరు టౌన్‌లో ఇందిరమ్మ కాలనీలో వైఎస్ఆర్ హయాంలో ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. వారికి గత ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వలేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఇందిరమ్మ కాలనీలో 1200 మందికి ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా, తనను కొవ్వూరు ఎంఎల్ఏగా ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.పంగిడి, చిడిపి గ్రామాల ప్రజాప్రతినిధులు, నియోజవర్గ నాయకులు, కొవ్వూరు ఆర్‌డిఒ, తహశీల్దార్ ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



పట్టాలను పంపిణీ చేస్తున్న హోం మంత్రి తానేటి వనిత

నిల్వ ఉన్న పంట సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

వరి కోతలు కోసి పంటను నిల్వ ఉంచుకుంటే వెంటనే కంట్రోల్ రూమ్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కలెక్టర్ కె.మాధవీలత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తుపాను ప్రభావం వల్ల ఎటువంటి పరిస్థితులు ఉత్పన్నమైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కోసిన పంట పొలాల్లో నిలువ ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే లక్ష్యంతో అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఈ మేరకు రవాణా నిమిత్తం లారీలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోని 24 గంటలు రైస్ మిల్లులు అందుబాటులో ఉండే విధంగా ఆదేశాలను జారీ చేశామన్నారు. పరిస్థితిని జాయింట్ కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తూ, క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారని తెలిపారు. వర్షాలు తగ్గేవరకూ వరి కోతలు కోయరాదన్నారు. వ్యవసాయ అధికారులు, శాస్త్ర వేత్తల సూచనలు పాటించాలన్నారు. పంటల్లో నీటి నిల్వలను తొలగించేందుకు ఉపాధి కూలీలను కేటాయిస్తామన్నారు. జిల్లా డివిజన్ మండల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేసేందుకు గ్రాస్ రూట్ లో ఉన్న వాలంటీర్ సేవలను వినియోగించుకుంటామన్నారు. కలెక్టరేట్, బొమ్మూరు 8977935609, ఆర్‌డిఒకార్యాలయం రాజమండ్రి 0883-2442344, ఆర్‌డిఒ కార్యాలయం కొవ్వూరు 08813231488 నెంబర్లను సంప్రదించాలన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్, ఫైర్ సర్వీస్ అధికారుల 10 టీములుగా ఏర్పాటు చేసి సిద్ధంగా ఉంచామని తెలిపారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిన విరిగిపోయిన వెంటనే పునరుద్ధరణ చేసేందుకు 500 స్తంభాలను ముందస్తు జాగ్రత్తగా సిద్ధం చేశామన్నారు.

కలెక్టర్ ఆదేశాలు మేరకు తడిసిన ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం మండలంలో ఇప్పటికి వరకు 228 ఎకరాల్లో వరి కోతలు జరిగాయని, పౌర సరఫరా శాఖ ద్వారా ఇప్పటివరకు ఆర్‌బికెల ద్వారా సుమారు 2679 మెట్రిక్ టన్నులు ఆన్‌లైన్‌లో, 928 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆఫ్‌లైన్‌లో కొనుగోలు చేశామని ఎఒ రాజరాజేశ్వరి తెలిపారు. పచ్చి ధాన్యం ప్రభుత్వ నిబంధనలకు లోబడి తహశీల్దార్ అనుమతితో దగ్గరలో మిల్లులకు తరలిస్తున్నామన్నారు. మండలంలో 89 ఎకరాలు వరి కుప్పల మీద ఉన్నాయని, 35 ఎకరాల పంట పనల మీద ఉందని తెలిపారు. బయటకు తెచ్చుకునే వీలు లేని చోట్ల ఉపాది హామీ పథకం శాఖ వారి సహకారంతో సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని తెలిపారు. పనలపై పంట రంగు మారకుండా ఉప్పుద్రావణం పిచికారీ చేయాలన్నారు.

కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం కుల గణనపై మండల స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఎంపిపి మట్టా వీరాస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గారపాటి శ్రీనివాస్ ఎస్.ముప్పారం సర్పంచ్ ముప్పడి మహాలక్ష్మి, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ బి.రాంప్రసాద్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఈ పథకంలో మొదటిది ఫెయిల్యూర్ సార్... రెండోదే బాగా సక్సెస్ అవుతోంది!

ముంపు బారిన పడకుండా చర్యలు

కమిషనర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తుపాను నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, నగరం ముంపు బారిన పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని కమిషనర్ కె.దినేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం నగరపాలక సంస్థ ఇంజినీరింగు, శానిటేషన్ అధికారులతో కలిసి ముంపునకు అవకాశమున్న హై టెక్ బస్టాండు, ఆర్యాపురం, కృష్ణనగర్, తుమ్మలోవ, గూడ్స్ గేట తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. హై టెక్ బస్టాండు వద్ద నీరు నిలువ ఉండకుండా ఉండేందుకు తగిన సంఖ్యలో సిబ్బందిని కేటాయించి కాలువలలో మురుగును ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలన్నారు. బురద లేకుండా చూడాలని ఆదేశించారు. ఎస్.ఆర్.సి.పి. పంపింగ్ స్టేషను ద్వారా నీటిని పంప్ చేయాలన్నారు. పెద్ద కాలువల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. అన్ని పెద్ద కాలువల వద్ద, పెద్ద కల్వర్టుల వద్ద బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కాలువ పనులు జరుగుచున్న చోట్ల షాపుల వారు అప్రమత్తంగా ఉండి వారి కస్టమర్లను తగిన సూచనలు చేయాలని కోరారు. ఎక్కడైనా రోడ్లపై చెట్లు పడిపోయిన, వర్షపు నీరు నిలువ ఉన్న నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెం.9494060060కు సమాచారం ఇవ్వాలన్నారు ఆయన వెంట ఇఇ మదర్షా ఆలీ, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎఇలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.



ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గోకవరం

తుపాను నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ టిడిపి నాయకులు, కార్యకర్తలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్న కారణంగా ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. ఇప్పటికే మెట్ట ప్రాంతంలో తీవ్ర వర్షాభావంతో పుష్కర ఎత్తిపోతల పథకం నిరుపయోగంగా ఉన్న కారణంగా 35 వేల ఎకరాలు ఎండిపోయిందని, మిగతా ప్రాంతంలో కోతకు వచ్చిన దశలో ఉన్న వరి పైర్లు అకాల వర్షాలతో మునిగిపోయి రైతును తీవ్ర నష్టాలకు గురిచేస్తున్న కారణంగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

ప్రజాశక్తి-గోకవరం

తుపాను కారణంగా వరి చేలు నేలకొరి గాయని, ధాన్యం కళ్లాలు నీట మునిగాయని ఫలితంగా రైతులు నష్టపోయారని, వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు పాలూరి బోసుబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. తుపాను తీరని కష్టం తెచ్చిపెట్టిందన్నారు. చేతికందిన పంట చేజారడంతో రైతులు తీవ్ర అందోళన చెందుతున్నారన్నారు.

నేరాలు ఘోరాలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన రూరల్ మండలం వలసపాకల గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను సర్పవరం సిఐ ఆకుల మురళీ కృష్ణ వివరించారు. గ్రామానికి చెందిన తిరగటి వీరభద్రరావు సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. తుపాన్ ప్రభావంతో విద్యుత్ కోతతో నెట్ సదుపాయం లేకపోవడంతో సోమవారం సాయంత్రం భార్యతో కలిసి గుడారి గుంట అత్తవారింటికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగల గొట్టి తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన ఇంటి యజమాని వీరభద్రరావు సర్పవరం పోలీసులకు సమాచారం అందించారు. ఈ చోరీలో సుమారు 40 కాసుల బంగారంతోపాటు, రూ.1.50 లక్షల నగదును ఎత్తుకు పోయినట్లు కుటుంబ యజమాని తెలిపారు. సంఘటనా ప్రాంతాన్ని డిఎస్పి మురళీకృష్ణ రెడ్డి, క్రైమ్ డిఎస్పి రాంబాబు, ఐటి కోర్ శ్రీనివాస్ సందర్శించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రెండు రేషన్ షాపుల సీజ్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పట్టణంలోని కమ్మరి వీధి, ఉప్పువారి వీధుల్లో 2 రేషన్ దుకాణాలను విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ దాడులు సీజ్ చేశారు. రేషన్ సరుకులను అక్రమంగా పక్కదారి పట్టిస్తున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు ఏకకాలంలో మంగళవారం రేషన్ షాపులను తనిఖీలు చేశారు. సరుకుల నిల్వలో పెద్దఎత్తున తేడాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దానితో రెండు దుకాణాలను అధికారులు సీజ్ చేసి డీలర్లపై 6(ఎ) కేసులు నమోదు చేశారు. రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాన్ని అధికారులు సీజ్ చేశారు.

విద్యుత్ షాక్‌కు గేదె మృత్యువాత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమో...ప్రజలు, రైతుల అజాగ్రత్తో కొంతు తీగలు మూగజీవాల పాలిట యమపాశాలు అవుతున్నాయి. తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడే విద్యుత్ తీగలు, ఎక్క తెరజడి మరమ్మతులు, నిర్వహణ లేక చిన్నపాటి గాలికే తెగిపడే వైర్లు కంచెలని ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్తింగ్ లోపాల కారణంగా పదుల సంఖ్యలో మూగజీవాలు కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. మంగళవారం రూరల్ మండలం వాకలపూడి గ్రామంలో చోటుచేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పెంకే అప్పారావు రైతు 6 గేదెలను మేపుతూ ఇచ్చిన పాలును అమ్మి జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం గేదెలను మేతకు తోలుకెళ్లాడు. సోమవారం రాత్రి కురిసిన గాలి వాన బీభత్సానికి వాకలపూడి రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడాన్ని గమనించని రైతు యథావిధిగా అదే మార్గంలో గేదెలను తోలుకెళ్లాడు. ఈ క్రమంలో పాడి గేదెకు కరెంట్ షాక్ తగిలి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.60 వేల వరకూ ఉంటుందని యజమాని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ ఆధ్వర్యంలో మృతి చెందిన గేదెకు పంచనామా నిర్వహించారు. విద్యుత్ శాఖ తరపున ఆర్థిక సాయం అందించి తనను ఆదుకోవాలని రైతు కోరారు.

చెరువును తలపిస్తున్న రోడ్లు



జగ్గంపేటలో చెరువును తలపిస్తున్న మెయిన్ రోడ్డు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తుపాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రమైన జగ్గంపేట హైవే సర్వీస్ రోడ్‌లో నీరు నిల్చిపోవడంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కల్గుతోంది. సర్వీస్ రోడ్ కోసం సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాల పోవడం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. హైవే డ్రయినేజీలో పూడిక తీయకపోవడంతో మురిగినీటి ప్రవాహం లేకుండా పోయింది. దీంతో వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోతుంది. గోకవరం రోడ్‌లో ఉన్న పోలవరం వంతెన మొత్తం నీటితో నిండిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రయిన్లలో పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు జాగ్రత్తలు పాటించండి

ప్రజాశక్తి - పెద్దాపురం

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాల వల్ల వరి పంటకు నష్టం జరగకుండా వ్యవసాయాధికారుల సూచనలను రైతులు పాటించాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సిహెచ్‌వి.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిచేలను కోయరాదన్నారు. పూర్తిగా ఆరని వరి పనలను తుపాను సమయంలో కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేయాలని సూచించారు. కోత కోసి పొలంలో ఉన్న పనలు వర్షానికి తడిసినట్లయితే గింజ మొలకెత్తకుండా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారి చేయాలన్నారు. కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచు కోవాలన్నారు. నూర్చిన ధాన్యం 2-3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పల్లో గింజ మొలకెత్తటమే కాకుండా రంగు మారి చెడు వాసన వస్తుందన్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకు క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టాలన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని బియ్యంగా కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకుంటే కొంత మేరకు నష్టం తగ్గించవచ్చారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన, దోష రహిత ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యమని కాకినాడ సిటీ నియోజకవర్గ ఇఆర్ఒ, నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ- 2024 లో భాగంగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన ప్రతి ఒక్క దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఓటరు ప్రత్యేక శిబిరంలో వచ్చిన దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు(వైసిపి), తుమ్మల రమేష్ (టిడిపి) అప్పారావు(బిఎస్‌పి), డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎఇఆర్‌ఒలు మురళీకృష్ణ, జాన్‌బాబు, హరిదాసు, నాగశాస్త్రులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ ఆక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తా

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న నానాజీ

ఎంఎల్ఎ ద్వారం పూడి చంద్రశేఖర్ రెడ్డి అక్రమాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని జనసేన పిఎసి సభ్యులు పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వ్యక్తి విషయంలో తాను తొందరపాటులో మాట తూలిన విషయం పట్ల అప్పుడే విచారం వ్యక్తం చేశానన్నారు. తాను రైతుల కష్టాల కోసం మాట్లాడుతుంటే ఎంఎల్‌ఎ ద్వారంపూడి తనపై వ్యక్తిగతంగా దూషణకుల దిగుతున్నారని అన్నారు. త్వరలోనే ఆయన భాగోతాన్ని బహిరంగ పర్చేందుకు వెనకాడేది లేదన్నారు. వ్యవసాయ శాఖ మంత్రిగా కురసాల కన్నబాబు రైతుల వద్ద నుంచి కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. తన తండ్రి ఎంతో గౌరవ మర్యాదలతో మెలిగారన్నారని, సమాజం పట్ల హుందాగా, బాధ్యతతో తమ కుటుంబం వ్యవహరిస్తుందని తెలిపారు. తాను కాంట్రాక్టులు చేసినా ఎవరినీ మోసం చేయలేదన్నారు. వైసిపి సీనియర్ నేత, ఎంపి పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వంటి వారిపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని నానాజీ హెచ్చరించారు. ఈ సమావేశంలో తోట శ్రీరామకృష్ణ, శిరంగు శ్రీనివాసరావు, కరెడ్ల గోవిందరాజులు, పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఓల్డేజ్ హోమ్ ద్వారా ఆహారం పంపిణీ



తుపాన్ బాధితులకు భోజనం అందిస్తున్న హోం సిబ్బంది

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆదేశాలతో గత రెండు రోజులుగా యానాం ఓల్డ్ ఏజ్ హోమ్ ద్వారా మిచౌంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సుమారు 4000 మందికి పైగా భోజనం ఏర్పాటు చేసి ఓల్డ్ ఏజ్ హోం సిబ్బంది ద్వారా ఆయా గ్రామాల ప్రజలకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొనుగోళ్లలో నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి - కాకినాడ

ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం పెట్టిన నిబంధనలను సడలించి ధాన్యంను కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు టి.నాగేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, సెక్రటరీ వి.రాజబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటనను విడుదల చేశారు. తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు కాకినాడ జిల్లాలో తడిసిన ధాన్యం రాశులు, పంట పొలాల్లోని పంట నీట మునిగిందని అన్నారు. పంట నీట మునగడంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

వికలాంగుల దినోత్సవం వాయిదా

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 6న స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ పాఠశాల ఆవరణంలో నిర్వహించాల్సిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం వేడుకలను తుపాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు శర్మ, చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. వికలాంగులు, వారి తల్లిదండ్రులు గమనించాలని, ఈ వేడుకలను ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియ చేస్తామని చెప్పారు.

రక్షణలో నౌకాదళం కీలక పాత్ర

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

భారతదేశ సముద్ర ప్రయోజనాల రక్షణకు నిరంతరం బాధ్యతగా పనిచేస్తున్న సంస్థ నౌకా దళమని ఆ సంస్థ విశ్రాంతి అధికారి చావలి రామచంద్ర ప్రసాద్ అన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో భారత నౌకా దళ వారోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో భారత నౌకాదళం సాధించిన విజయాలు, దేశ రక్షణలో వారి పాత్రను గుర్తించడానికి డిసెంబర్ 1 నుంచి 7 వరకు నౌక దళ వారోత్సవాలను జరుపుకుంటామని అన్నారు. సముద్ర సరిహద్దులను సురక్షితం చేయడం తోపాటు మానవతా విపత్తు ఉపశమనం మొదలైన వాటి ద్వారా భారతదేశం యొక్క అంతర్జాతీయ సంబంధాలను మెరుగుపరచడం లో నౌకాదళం పాత్ర మరువలేనిదన్నారు.

పరికరాలకు నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్



వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపల్ చంద్రనాయుడు, రఘురామ్

స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ప్రయోగశాలలో పరిక రాలకు నిధులు మంజూరు చేయాలని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ బృందాన్ని కళాశాల ప్రిన్సిపల్ ఇ.చంద్రనాయుడు, కళాశాల డవలంప్‌మెంట్ కమిటీ కార్యదర్శి ఒప్పి రఘురామ్ కోరారు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ స్వతంత్ర డైరెక్టర్ చిలుకూరి రామ్ కుమార్ సారథ్యంలో ఇతర డైరెక్టర్లు మంగళవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల మౌలిక వసతులు సంతప్తికరంగా ఉన్నాయని బృందం అభిప్రాయం వ్యక్తం చేసింది. కళాశాలలో ప్రయోగ సాలలో తగిన ప్రయోగాలను నిర్వహించడానికి విద్యార్థులకు తగిన ప్రయోగపరికారాలు అందుబాటులో లేవని, కావున సిఎస్ఆర్ నుంచి నుంచి కళాశాలకు ప్రయోగశాల పరికరాల ఏర్పాటుకు మరియు కంప్యూటర్ల సరఫరా కొరకు నిధులు మంజూరు చేయలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ బృందం సిద్దార్ధ మన్నవ, మేనేజర్ ఎ. దుర్గాప్రసాద్, జాయింట్ జనరల్ మేనేజర్, ఎంపిడిఒ వసంతకుమార్ పాల్గొన్నారు.

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పన

ప్రజాశక్తి - పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరూ కృషి చేయాలని ఆర్‌డిఒ జె.సీతారామారావు అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కారాక్యలయంలో ఆయన అధ్యక్షతన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను ప్రతి ఒక్కరు తూచా తప్పక పాటించాలన్నారు. నూతన ఓటర్ నమోదుకు సంబంధించి 1477 అప్లికేషన్లు, మరణించిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారికి సంబంధించి 647, ఓటరు జాబితాలో సవరణలు, చేర్పులకు సంబంధించి 748 అప్లికేషన్లు అందాయన్నారు. ఈ అప్లికేషన్లకు సంబంధించిన వివరాలన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. ఈ సమావేశంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు(వైసిపి), రంది సత్యనారాయణ(టిడిపి), నీలపాల సూరిబాబు(సిపిఎం) పాల్గొన్నారు.

మురమండలో 'వికసిత్ భారత్'

ప్రజాశక్తి-కడియం

మురమండ సర్పంచ్ అయినవల్లి రుక్మిణి, ఎంపిటిసి సభ్యుడు మెల్లిమి మంగా గంగరాజు అధ్యక్షతన మురమండ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభా కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా బిజెపి నాయకుడు బొరుసు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీ అమలు చేస్తున్న 20 సంక్షేమ పథకాలు గురించి హాజరైన వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి కౌశల్ యోజన, అమత్ పథకం, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, బేటీ బచావో బేటి పడావో మేకింగ్ ఇండియా, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి విశ్వ కర్మ యోజన, మొదలగు 20 సంక్షేమ పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు గ్యాస్ స్టౌవ్‌లు, ఆయుష్మాన్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మురమండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రధానోపాధ్యాయురాలు బొండాడ సుధ ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. మండల ఉద్యాన అధికారి సుధీర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పద్మావతి వెలుగు ఎపిఎం నీలి సూరిబాబు, సిసి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు,



కార్యక్రమంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు

నాయీ బ్రాహ్మణ సంఘ వన సమారాధన

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజవర్గంపరిధిలో నాయీబ్రాహ్మణ సంఘం వనసమారాధన కార్యక్రమం మంగళవారం ద్రాక్షారామలో నిర్వహించారు ముఖ్యఅతిథిగా నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఆచంట సుబ్బారావు పాల్గొని ప్రసంగించారు. నాయీబ్రాహ్మణ సంఘం అభివద్ధికి బలోపేతానికి సంఘ సభ్యులంతా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎపి ఐడిసి డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మండల కో ఆప్షన్ సభ్యులు అహ్మద్ అలీషా, మాజీ ఎంపిటిసి సభ్యులు దడాల రవికుమార్, నాయీ బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు చింతలపూడి సత్తిబాబు, సెక్రటరీ సుందరపల్లి వెంకటేశ్వరరావు, రామచంద్రపురం టౌన్ అధ్యక్షులు జగన్నాథం, మాజీ అధ్యక్షులు దండకడియల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఉపాధి హామీ చట్టంలో భాగంగా పంచాయతీ రాజ్, మరియు పెన్షన్లపై 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపిపి-2 సానబోయిన నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ చట్టంలో భాగంగా చేసిన పనుల వివరాలు, చెల్లింపులు, జాబ్‌కార్డు ద్వారా చెల్లింపులు, వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, పెన్షన్లలో ఎక్కడ అయినా లోపాలు ఉన్నాయా వంటి అంశాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సిబ్బంది భాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా విజిలెన్స్ అధికారి భీమేశ్వర రావు, అంబుడ్స్ మెన్ జ్యోతి, డిఆర్‌డిఎ డిపిఎం అన్నపూర్ణ, ఎంపిడిఒ కె.కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన ఆనంద నిలయం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్లలో మిచౌంగ్ తుపాను కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక ఆనంద నిలయం బిల్డింగ్ నీట మునిగింది. దీంతో విద్యార్థులు కూర్చోవడానికి కూడా చోటు లేక నిలబడే ఉన్నారు. స్థానికుల సకారంతో దగ్గరలో ఉన్న ఎంపిపి పాఠశాల నెం (1) కు విద్యార్థులను తరలించారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ సంబంధిత భవనాన్ని పునర్నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు ఈ సమస్యను ప్రజాప్రతినిధులకు, స్థానిక ఎంఎల్‌ఎ తలారివెంకట్రావుతోపాటు జిల్లా అధికారులందరి దృష్టికి తీసుకువెళ్లానని, వాట్సాప్ ద్వారా తెలియజేయడమే కాకుండా గ్రూపుల్లో సైతం పోస్ట్ చేయగా యంత్రాంగం అంతా చూశారని వార్డెన్ కె.ధర్మయ్య అన్నారు. ఎవరు ఇప్పటివరకు స్పందించ లేదన్నారు. తద్వారా ఇలాంటి పరిస్థితిని బట్టి వేరే విద్యార్థులు ఇక్కడ జాయిన్ అయ్యేందుకు ఇష్టపడడం లేదు అని తెలిపారు.

విద్యుత్ సరఫరా లేక అవస్థలు

ప్రజాశక్తి-ఉంద్రాజవరం

మిచౌంగ్ తుపాను బీభత్సానికి తోడు మండల ప్రజలకు రెండు రోజులుగా విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. భారీ వర్షం, గాలులకుకమ్యూనికేషన్ వ్యవస్థ దాదాపు కుంటుపడిపోయింది. మండల విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు తెగిపోయిన లైన్లను రిపేర్ చేసి, సరఫరా పునరుద్ధరింప చేస్తున్నప్పటికీ, మండలం మొత్తం ఒకేసారి ఇబ్బంది ఏర్పడటంతో, గ్రామాల ప్రజలు లైన్మెన్లు లేకపోవడంతో ఎవరికి మొరపెట్టుకోవాలో తెలియక చీకట్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. దీనికి తోడు నిడదవోలు ప్రాంతంలో టోర్నడోలు కూడా బీభత్సం సష్టించడంతో ప్రజలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది.

ఓట్ల సవరణ, నమోదుపై సమీక్ష

ప్రజాశక్తి-మండపేట



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓట్ల సవరణ, ఓట్ల నమోదు తదితర అంశాలపై శని, ఆదివారాల్లో జరిగిన స్పెషల్ క్యాంపన్లో వచ్చిన దరఖాస్తులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి ఎస్.సుధాసాగర్ మంగళవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు, పలు పార్టీల రాజకీయ నాయకులతో పాటు మున్సిపల్ కమిషనర్ టి.రాముకుమార్, తహశీల్దార్ టిఆర్.రాజేశ్వరరావు, మండల పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో అభిషేక్ ప్రతిభ

ప్రజాశక్తి-రామచంద్రపురం



రన్నర ట్రోఫీతో బోస్ అభిషేక్

బెంగళూరు వేదికగా జరిగిన కర్ణాటక బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో మోడరన్ విద్యార్థి బోస్ అభిషేక్ ప్రతిభను చాటాడు. నవంబర్ 28 నుంచి డిసెంబర్ 5 వరకు జరిగిన యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్-2023లో పట్టణానికి చెందిన మోడరన్ హైస్కూల్ విద్యార్థి బోను అభిషేక్ అండర్-15 డబుల్స్ కేటగిరీ నందు ఆల్ ఇండియా లెవెల్‌లో ద్వితీయస్థానం సాధించి రన్నర్ గా నిలిచినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జివి.రావు తెలిపారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ అభిషేక్ రూ.15 వేలు నగదు పురస్కారంతో పాటు ప్రముఖుల చేతుల మీదుగా ట్రోఫీ తీసుకున్నారని వివరించారు. అభిషేక్ మరో విజయాన్ని దక్కించుకోవడం సంతోషదాయకం అని అన్నారు. మోడరన్ హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి మాట్లాడుతూ విజయమే లక్ష్యంగా ప్రతీ టోర్నమెంట్ నందు ప్రతిభ చూపుతున్న అభిషేక్ భవిష్యత్‌లో దేశం గర్వించే గొప్ప క్రీడాకారుడు కావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ తన వరుస విజయాల పరంపరకు వెన్నుదన్ను గా నిలుస్తున్న అంశాలు తల్లిదండ్రుల విశేషమైన ప్రోత్సాహంతో పాటు తన ప్రతిభకు మద్దతుగా నిలుస్తున్న మోడరన్ కరస్పాండెంట్ జివి.రావు అని ధన్యవాదాలు తెలిపాడు. ఈ సందర్భంగా అభిషేక్‌కు హెచ్.ఎం.ముత్యాల చిట్టిబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

నేడు కుల గణనపై సమావేశం

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.రామకష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్‌పిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, తహశీల్దార్, మండల స్థాయి అధికారులు, సచివాలయాల వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

సమస్యలపై పోరాడే వారికి అండగా జనసేన

ప్రజాశక్తి-గోకవరం

సిఎం జగన్‌ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ముఖ్యమైన హామీ ప్రతి పేదవానికి ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇస్తానని జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి పాఠంశెట్టి సూర్యచంద్ర అన్నారు. కానీ ఇది ఎక్కడా ఆచరణలో మాత్రం సాధ్యం కావట్లేదన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఎవరు పోరాడినా వారికి జనసేన పార్టీ అండగా ఉంటుందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు గడిచిపోయినా గోకవరంలో ఇళ్ల స్థలాలను గుర్తించలేదన్నారు. ఈ ఇళ్ల స్థలాల సమస్యపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టామని, అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు గాని, ప్రజా ప్రతినిధులు గాని ఈ సమస్యపై స్పందించలేదన్నారు. ఇదే సమస్యపై అధికార పార్టీ గోకవరం మండల ఎంపిపి సుంకర శ్రీవల్లి, సుంకర వీరబాబు మీడియా ముఖంగా అధికారులను ప్రశ్నించడం అభినందనీయమన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు ఈ సమస్యపై స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలను అందించాలన్నారు.



అరటి గెల

అబ్బురపరుస్తున్న ఏడు అడుగుల అరటి గెల

ప్రజాశక్తి-ఆత్రేయపురం

సాధారణంగా అరటి గెల రెండు అడుగుల నుంచి మూడు అడుగుల వరకు ఉంటుంది. ఉచ్చిలి గ్రామానికి చెందిన భూపతి రాజు సుబ్బరాజు తన పొలంలో సేంద్రియ ఎరువులతో పెంచిన అరటి చెట్టు ఏడడుగులు భారీ స్థాయిలో అరటి గెల వేయడంతో అందరిని అబ్బుర పరుస్తోంది. జన్య పరివర్తన చెందటంతో పాటు భూమి లో సారవంతం ఎక్కువైనప్పుడు భారీ స్థాయిలో అరటి గెలల వేస్తాయని ఉద్యాన అధికారులు చెబుతున్నారు.

మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు
M.V.O.P. No. 17/2023

Between:
రేలంగి నాగేశ్వరరావు -పిటీషనర్
మరియు
1. ఎన్.నాగరాజు
2. తోట శివప్రసాద్
3. న్యూ ఇండియా ఇన్సురెన్స్ కంపెనీ, కాకినాడ -రెస్పాండెంట్లు

To:
R-2: తోట శివప్రసాద్, తండ్రి: (లేటు) నాగేశ్వరరావు, ఇంటి నెం. 60-7-26/3, P&T కాలనీ, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం అర్బన్ మండలం.

పై నెంబర్ వ్యాజ్యంలో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు పంపిన నోటీసులను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించుట వలన శ్రీ కోర్టు వారి ఆదేశములతో ఈ ప్రకటన జారీ చేయటమైనది. పై నెంబరు వ్యాజ్యంలో మీ హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ది. 05-01-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. **ది. 05-01-2024వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు శ్రీ కోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరు కాని యెడల వ్యాజ్యము మీ పరోక్షము నందు తీర్మానింపబడునని తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆదేశములతో)
చిత్తలూరి వెంకట సుబ్బారావు
చిత్తలూరి అనూరాధ
న్యాయవాదులు, డోర్ నెం.5-81
సంతోష్ నగర్, ఎ.పి.యస్.పి. వెనుక
కాకినాడ-533005
కాకినాడ సెల్:9948519236
ది.05-12-23 9492350146